# మల్లమ్మ గుంటలో తల్లిపాల వారోత్సవాలు



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లా రాపూరు మండలం మల్లంగుంట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో శారద పర్యవేక్షణలో, రాపూరు-1 సెక్టార్ సూపర్వైజర్ రాధిక ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగనవాడి అధికారులు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు, ముఖ్యంగా ముర్రుపాలు పట్టించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ముర్రుపాలలో శిశువుకు అవసరమైన పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే అంశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం ద్వారా శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని సూచించారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకుని, శిశువుకు మొదటి ఆహారంగా తల్లిపాలనే అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి, ప్రమీల, వరలక్ష్మి, ఆసిఫా, మాధవి, సాధీర అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఫలాలు ప్రతి ఇంటికి చేరాలి.!!

## ఇంటింటికి చమర్తి జగన్ మోహన్ రాజు.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 08:

రాజంపేట నియోజకవర్గం లోని, కొత్త మాధవరం గ్రామాల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలపై చమర్తి ఆరా తీస్తున్న క్రమంలో ప్రజలకు వివరిస్తూ కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పాలన అందిస్తూ, సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తుందని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శనివారం నాడు ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామం నందు పర్యటిస్తూ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని చమర్తి జగన్ మోహన్ రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగన్ మోహన్ రాజు సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చమర్తి తెలియజేశారు. అంతకుముందు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ప్రభుత్వ పాలనపై అవగాహన కల్పించడంతోపాటు,స్థానిక సమస్యలను,ప్రజల అభిప్రాయాలను చమర్తి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులు తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర స్థానిక సమస్యలను చమర్తి దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే వాటిని సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని జగన్ మోహన్ రాజు హామీ ఇచ్చారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ వారి సూచనలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఒంటిమిట్ట, రాజంపేట ప్రాంతాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్దే కూటమి ప్రభుత్వం లక్ష్యం.!!

**జనసేన రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ శ్రీనివారాజు.**

**25 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన యల్లటూరు**

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 08:

నాయకులందరూ ఓట్లు అడగడానికి మాత్రమే వచ్చారు సార్... మీరు మాత్రం అభివృద్దే లక్ష్యంగా అడిగిన వేంటనే రోడ్డు వేయిస్తున్నారు... మీకు మా కృతజ్ఞతలు సార్ అంటూ అభిమానం చాటుకున్న నల్లతిమ్మయ్యగారిపల్లి గ్రామస్తులు. కడపజిల్లా నందలూరు మండలం నల్లతిమ్మయ్యగారిపల్లి ఎల్ఎం.పురం ప్రాంతంలో నూతనంగా 25 లక్షల రూపాయలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు శ్రీకారం చుట్టారు. రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా యల్లటూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధిని ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతోందన్నారు. రాబోయే 30 సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వం కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రపంచ పటంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావచ్చనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని శ్రీనివాసరాజు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు రహదారుల నిర్మాణం, మరమ్మతులు, అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు .



# డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్ రెడ్డితో పాటు ఎనిమిది మందిపై కేసు నమోదు




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 08:

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల విలువైన భూములను అక్రమంగా కట్టబెట్టిన వ్యవహారంలో ప్రస్తుత నెల్లూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్ రెడ్డితో పాటు మరో ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో వీఆర్వో, సబ్‌రిజిస్ట్రార్‌లు కూడా నిందితులుగా ఉన్నారు. కడప నగర శివారులోని సుమారు రూ.12 కోట్ల విలువైన భూమిని నకిలీ సర్టిఫికెట్లు, పత్రాల ఆధారంగా వేరొకరి పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. గతంలో సీకే దిన్నె తహశీల్దార్‌గా పనిచేసిన సమయంలో మహేశ్వర్ రెడ్డి వైసీపీ నాయకులతో చేతులు కలిపి ఈ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రికార్డులను పరిశీలించి నకిలీ పత్రాల వ్యవహారాన్ని నిర్ధారించుకున్న అధికారులు, డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న మహేశ్వర్ రెడ్డి సహా మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్టు సమాచారం..

# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం గా ప్రతీ కార్యకర్త పనిచేయాలి



కొత్తపేట (బిఎన్ఎస్ )ఆగస్టు 8 : కొత్తపేట మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు అధ్యక్షతన ఆయన నివాసంలో మండల బీజేపీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, కొత్తపేట మండల ఇన్‌చార్జి అయినవిల్లి సత్తిబాబు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ప్రతి బీజేపీ కార్యకర్త క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలకు పార్టీ విధానాలను చేరువ చేస్తూ, ఎన్నికల్లో బీజేపీని బలమైన శక్తిగా నిలిపేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

అనంతరం మండల కమిటీ పరిధిలోని వివిధ మోర్చాలకు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను నియమించారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా రేలంగి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా దంగేటి సాయి కుమార్, వెన్నేటి రామకృష్ణలను నియమించారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా చోడపనీడి నాగబాబు, ప్రధాన కార్యదర్శిగా చోడపనీడి ఈశ్వర్ రావును నియమించారు.

యువ మోర్చా మండల అధ్యక్షుడిగా అడబాల రమేష్, ప్రధాన కార్యదర్శిగా చోడపనీడి ముఖేశ్‌ను నియమించారు. మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా అజ్జరపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా కె. సత్యానందం, పిల్లి ప్రభాకర్‌లను ప్రకటించారు.

మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా పేకేటి కామేశ్వరి దివ్య, ప్రధాన కార్యదర్శిగా కోటిపల్లి సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా బి.వి.వి. సత్యనారాయణాచార్యులను నియమించారు. ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా తరిట్ల శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సాకా రామకృష్ణలను ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా నాయకులు పాలూరి జయ ప్రకాష్ నారాయణ, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కోటిపల్లి దామోదర్, కిసాన్ మోర్చా నాయకులు ఉద్దరాజు ప్రసాద్ రాజు, మందపల్లి దేవస్థానం డైరెక్టర్ కోటిపల్లి సుబ్బలక్ష్మి, ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవ స్వామి, మండల ప్రధాన కార్యదర్శి బల్ల రాజు, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పొనుగుపాటి శ్రీనివాస్, అన్యం సత్యనారాయణ, జిల్లా యువ మోర్చా కార్యదర్శి వలపశెట్టి కిరణ్ తేజ్ , జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కోటిపల్లి రఘురామ్, సిద్ధంశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్ట్ 08:

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో నిర్వహించిన ఇంటింటికి టీడీపీ డోర్ టు డోర్ క్యాంపెయిన్ కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మహా న్యూస్ టీవీ ఛానల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జడ్జిమెంట్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఈ రెండేళ్ల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలు, మైదుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మైదుకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పుట్టా తెలిపారు

# "జమ్మలమడుగు" లో వైసీపీ 3 వరోజు రిలే నిరాహార దీక్షను భగ్నం చేసిన పోలీసులు.!!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 08:

జమ్మలమడుగు పట్టణంలో డీఎస్సీ నిర్వహణలో జరిగిన అక్రమాలపై వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి గత 3 రోజులుగా శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో అర్బన్ సీఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసు బలగాలు వైసీపీ నాయకులు చేస్తున్న దీక్షను భగ్నం చేశారు. దీంతో దీక్షా శిబిరం వద్ద భారీ ఉద్రిక్తత ఏర్పడింది. ఈ మేరకు ఎమ్మెల్సీరామసుబ్బారెడ్డిని, ఆయన సతీమణి ఇందిరను పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ తోపులాటలో ఎమ్మెల్సీ సోదరుడు ఎస్ఈసి సభ్యుడు గిరిధర్ రెడ్డి కిందపడి చేతికి తీవ్ర గాయమైంది. వెంటనే గిరిధర రెడ్డిని ఆసుపత్రికి తరలించారు.

ఇదిలా ఉండగా రంగం లోకి పొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వచ్చి దీక్షా శిబిరంలో కూర్చొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ.. స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారితో భారతీయులు పోరాడినట్లు కూటమి ప్రభుత్వం డిఎస్సీ నిర్వహణలో చేసిన అక్రమాలపై న్యాయం కావాలని వైసిపి నాయకులు చేస్తున్న దీక్షను కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి ఆదేశాలతో పోలీసులతో తమ నిరాహార దీక్షను అడ్డుకోవడం దారుణం అన్నారు. పోలీసులు వచ్చిన, కూటమి నాయకులు వచ్చిన దీక్ష చేసేది విరమించేది లేదన్నారు. అందుకోసం తమను తుపాకులతో కాల్చినా దీక్ష నుంచి తప్పు కునేది లేదన్నారు. అనంతరం వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా అర్బన్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు.

అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. శాంతియుతంగా పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు చేస్తున్న నిరాహార దీక్షను ఈ విధంగా దౌర్జన్యంగా పోలీసులతో కలిసి తమను పోలీస్ స్టేషన్ లో అరెస్టు చేసి తమ దీక్షను అడ్డుకోవడం హేయమైన చర్య అన్నారు. డీఎస్సీ నిర్వహణలో జరిగిన అక్రమాలకు సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమాధానం చెప్పకుండా న్యాయం కోసం పోరాడుతున్న తమను ఈ విధంగా అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఎంతమంది వచ్చి తమను బెదిరించిన న్యాయం కోసం వైసీపీ నాయకులు వెనుకాడేది లేదన్నారు.

ఈ కార్యక్రమంలో వైసిపి మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వల్లంబాయి ఋషికేశవరెడ్డి, వైసీపీ నాయకులు మహేశ్వర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, ముల్లా జానీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో కియా కొత్త ఎలక్ట్రిక్ కార్ ఆవిష్కరణ

**ప్రారంభించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**




బిఎన్ఎస్ :సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ శనివారం రాత్రి రైల్ నిలయం సమీపంలోని కియా మోటార్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కియా మోటార్స్ సరికొత్త ఎలక్ట్రిక్ కారును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో కాలుష్య రహిత మరియు పర్యావరణ అనుకూల ఎలక్ట్రిక్ వాహనాల శకం ప్రారంభమైందని, భవిష్యత్తు అంతా ఈ వాహనాలదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి ఇ-వాహనాలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘనమైన ఆవిష్కరణ కార్యక్రమంలో యువనేత తీగుళ్ళ కిశోర్ కుమార్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, షోరూమ్ ప్రతినిధులు మరియు ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మైదుకూరులో 20 లక్షల ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నూతన స్మశానవాటిక.

## ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 08:

దువ్వూరు మండలం.. గుడిపాడు గ్రామంలో 20 లక్షల ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన నూతన స్మశానవాటికను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. గుడిపాడు గ్రామ ప్రజలకు ఎంతోకాలంగా అవసరమైన స్మశానవాటికను 20 లక్షల ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. నూతన స్మశానవాటికను ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారికి గుడిపాడు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# స్విస్ ప్రాంగణంలో మీట్ ది ఆదర్ ప్రోగ్రామ్

హైదరాబాద్ బండ్లగూడ జాగిర్ లోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ (SVIS) ప్రఖ్యాత రచయిత, 49కి పైగా పుస్తకాలు వెలువరించిన చిత్తూరు వేణుగోపాల్‌తో 'మీట్ ద ఆథర్' (రచయితతో ముఖాముఖి) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, పాఠశాల విద్యార్థులతో, ఉపాధ్యాయులతో తన సాహిత్య అనుభవాలను పంచుకున్నారు.

కార్యక్రమం అనంతరం ఆయన పాఠశాల ప్రిన్సిపాల్‌ను కలుసుకున్నారు., ప్రిన్సిపాల్ రమా విశ్వనాథన్ నాయకత్వంలో టీచర్స్ మరియు మెంటార్ల బృందం అందిస్తున్న సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. విద్యాబోధనలోనూ, విద్యార్థుల సమగ్ర వికాసంలోనూ పాఠశాల బృందం చూపుతున్న అంకితభావాన్ని, కృషిని ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా తాను స్వయంగా రచించిన పలు గ్రంథాలను పాఠశాల ప్రిన్సిపాల్‌కు, యాజమాన్యానికి కానుకగా అందించారు. పాఠశాల లైబ్రరీకి ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని యాజమాన్యం తెలిపారు.

పాఠశాల ప్రిన్సిపాల్ రమ విశ్వనాథన్ మాట్లాడుతూ---విద్యార్థుల పురోగతికి, నైపుణ్యాభివృద్ధికి తల్లిదండ్రుల అనుభవాన్ని, నైపుణ్యాన్ని ఉపయోగించుకునేందుకు ూ౦×ూ ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. చిత్తూరు వేణు గోపాల్ కుమార్తె దివ్య కూడా స్టూడెంట్ కావటం విశేషం. ఇటువంటి పేరెంట్స్ తో

రకరకాల కార్యక్రమాలు, వేదికల ద్వారా తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ విద్యార్థులను



భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని ప్రిన్సిపాల్ రమ విశ్వనాథన్ స్పష్టం చేశారు.

# పేకాట స్థావరంపై దాడి 9 మంది అరెస్ట్

## రూ.4,160 నగదు, 5 బైక్‌లు స్వాధీనం

## చట్టవిరుద్ధ కార్యకలాపాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవు - సైదాపురం ఎస్ఐ దుర్గాప్రసాద్

నెల్లూరు జిల్లా సైదాపురం(బిఎన్ఎస్):- జిల్లా వ్యాప్తంగా పేకాట, గ్యాంబ్లింగ్ తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా ఎస్పీ డా. అజితా వెజెండ్ల ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సైదాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దాదిశెట్టిపల్లె గ్రామంలో శనివారం స్థానిక పోలీసులు పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి నిర్వహించారు.?ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,160/- నగదుతో పాటు 5 మొబైల్ ఫోన్లు, 5 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు సైదాపురం ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.?ఈ సందర్భంగా ఎస్ఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. మండలంలో పేకాట, మట్కా, గ్యాంబ్లింగ్, కోడిపందేలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే డయల్-112 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 9392903413 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదాపురం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలి: చైర్ పర్సన్





బిఎన్ఎస్ :రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు పరిగి ఎర్రగడ్డ పల్లి రోడ్డులో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించి పనులు సక్రమంగా జరపాలని నాణ్యత పాటించాలని సూచించారు

అన్ని వార్డుల్లోనూ అవసరమైన చోట్ల ఎమ్మెల్యే ఆదేశాలతో నూతన రోడ్లో నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు పరిగి పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ యూసుఫ్, బాదం అఖిల శ్రీనివాస్, కో-ఆప్షన్ నెంబర్ అక్బర్ హుస్సేన్, నాయకులు దోమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# కూటమి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల సంక్షేమ పాలన వివరిస్తూ కరపత్రాల పంపిణీ

## ప్రతి కుటుంబానికీ సూపర్ సిక్స్ ఫలాలు

## టీడీపీ మండల అధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డి



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల సంక్షేమ పాలన విజయవంతంగా పూర్తయిన సందర్భంగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు రాపూరు మండలంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. మండలంలోని సంక్రాంతిపల్లి, పోకూరుపల్లి, తానంచర్ల గ్రామాల్లో రాపూరు మండల టీడీపీ అధ్యక్షుడు చెన్ను అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటించారు.?ఈ సందర్భంగా నాయకులు ప్రతీ ఇంటికీ వెళ్లి గత రెండేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్తులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.?ఈ సందర్భంగా చెన్ను అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమమే పరమ లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి ఆర్థిక చేయూత అందుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాబోయే రోజుల్లో రాపూరు మండలాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో పెంచలకోన దేవస్థానం చైర్మన్ చెన్ను తిరుపాల్రెడ్డి, దందోలు వెంకటేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు మధు నాయుడు, చెన్ను భాస్కర్ రెడ్డి, కొండ్లపూడి రాఘవరెడ్డి, నల్లవడ్ల వెంకటరమణారెడ్డి, ఎంఎంటీ మధురెడ్డి, షేక్ ముక్తార్, దేసు భాస్కర్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, మల్లెపాటి వెంకటరమణారెడ్డి, చాంద్ భాషా, సమయం ప్రసాద్, కొండాపురం కస్తూరి, ఇస్తర్ల సూర్యప్రకాష్ యాదవ్, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా చేనేత సెల్ కన్వీనర్‌గా కంది శ్రీరాములు నియామకం

## చేనేత కార్మికుల సమస్యలపై పోరాడతానని వెల్లడి




బిఎన్ఎస్: హైదరాబాద్ వనస్థలిపురంలోని కర్నాటి గార్డెన్స్‌లో నిర్వహించిన చేనేత దినోత్సవ సభ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా చేనేత సెల్ కన్వీనర్‌గా కంది శ్రీరాములు నియమితులయ్యారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచందర్ రావు ఆదేశాల మేరకు, రాష్ట్ర చేనేత సెల్ కన్వీనర్ కర్నాటి ధనంజయ ఈ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కంది శ్రీరాములు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారతీయ సంస్కృతికి ప్రతీక అయిన చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న ఆయన, కష్టాల్లో ఉన్న చేనేత కార్మికుల హక్కులు, ఉపాధి, మరియు సంక్షేమం కోసం తాను నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని ప్రతి మండలంలో చేనేత వస్త్రాల వినియోగంపై విస్తృత అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కార్మికుడికి అందేలా చిత్తశుద్ధితో కృషి చేస్తానని, స్వదేశీ రంగాన్ని బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని శ్రీరాములు ఈ సందర్భంగా ప్రకటించారు.

# చర్చి భూమి పేరుతో

# వెయ్యి గజాల ఆక్రమణ?

## దేవాలయాన్ని తరలించి కమ్యూనిటీ హాల్‌కు స్థలం ఇవ్వాలంటూ అధికారులకు ఫిర్యాదు




చందానగర్: చందానగర్ గంగారం ప్రాంతంలోని శ్రీ శ్రీ పోచమ్మతల్లి దేవాలయం సమీపంలోని సర్వే నంబర్లు 366,



367లోని స్థలంపై వివాదం నెలకొంది. ఈ స్థలంలో కొంత భూమి క్రైస్తవ మత సంస్థకు కేటాయించబడిందని, అయితే కేటాయించిన సుమారు 300 చదరపు గజాలకు మించి మరో 1,000 చదరపు గజాల వరకు ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ దేవాలయ కమిటీ, గ్రామస్థులు శేరిలింగంపల్లి జోనల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ఫ్లైఓవర్ నిర్మాణంతో దేవాలయం తరలింపు ప్రతిపాదన

భవిష్యత్తులో ప్రతిపాదిత ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా దేవాలయాన్ని ప్రధాన రహదారి నుంచి బోస్త్ ఆస్పత్రి సమీపంలోని కమ్యూనిటీ హాల్ వద్దకు తరలించేందుకు గ్రామస్థులు నిర్ణయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని కోరారు.



స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణ తొలగించాలని వినతి

సర్వే నంబర్లు 366, 367లో ప్రభుత్వ/కేటాయింపు భూమి పరిస్థితిపై అధికారికంగా సర్వే నిర్వహించి, ఆక్రమణలు ఉన్నట్లయితే తొలగించాలని దేవాలయ కమిటీ కోరింది.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి, దేవాలయ తరలింపు సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది.

ఫిర్యాదుపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, భూమి హక్కులు, కేటాయింపులు, ఆక్రమణలపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

# భాగ్యరధి డిగ్రీ కళాశాలలో ఘనంగా బోనాల పండుగ

## తెలంగాణ సంస్కృతిని చాటిన విద్యార్థులు



బిఎన్ఎస్: భాగ్యరధి డిగ్రీ కళాశాలలో బోనాల పండుగను విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు కలిసి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు అమ్మవారి వేషధారణలతో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా చేసిన ప్రత్యేక ప్రదర్శనలు మరియు బోనాల ప్రాముఖ్యతను వివరించిన తీరు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొని విద్యార్థుల ప్రతిభను మనస్ఫూర్తిగా అభినందించారు. బోనాల పండుగ మనకు భక్తి, ఐక్యత, క్రమశిక్షణతో పాటు సాంస్కృతిక విలువలను గుర్తు చేస్తుందని, విద్యార్థులు చదువుతో పాటు మన పూర్వీకుల సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. మన తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ కళాశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.